సాక్షి
బాపట్ల
శనివారం। 24। ఆగస్టు। 2024



ఎన్నాడమ్మకు జలాభిషేకం

పిట్టలవానిపాలెం: మండలంలోని ఖాజీపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ ఎన్నాడమ్మ ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మవారికి మహిళలు జలాభిషేకం చేశారు.



శ్రావణమాస పూజలు

దాచేపల్లి: శ్రావణమాసం సందర్భంగా శుక్రవారం వాసవీ కన్యకా పరమేశ్వరి, బీర్ల అంకమ్మ ఆలయాలలో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. కుంకుమ పూజలు నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 589.10 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 8,221 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



భద్రతపై నిత్య పర్యవేక్షణ అవసరం

కోల్‌కతాలో వైద్యవిద్యార్థినిపై హత్యాచారం అమానుషం. నిస్వార్థ సేవలు అందిస్తున్న వైద్యులకు విధి నిర్వహణలో భరోసా కల్పించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలను కఠినంగా అమలు చేయాలి. ఎక్కడో ఒక ఘటన జరిగినప్పుడే కాకుండా ప్రతి నిత్యం వారికి భద్రత కల్పించాలి. రాత్రి సమయంలో మారుమూల ప్రాంతాలలోని పీహెచ్‌సీలో వైద్యసేవలు అందించే మహిళా డాక్టర్లపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి. సెక్యూరిటీ ఏర్పాటు, సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉంచాలి. పోలీసు పెట్రోలింగ్ ఏర్పాటు చేయాలి.

- డాక్టర్ అనూష, నిజాంపట్నం పీహెచ్‌సీ



సామాజిక చైతన్యంతోనే రక్షణ



వృత్తిపరంగా ప్రజల ప్రాణాలు కాపాడే వైద్యులు దైవంతో సమానంగా భావించే తత్వం పెంచాలి. ఆ దిశగా సామాజిక చైతన్యం కల్పించడం అవసరం. వైద్యశాలల్లో దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేకంగా వసతులు కల్పించాలి. నైట్ డ్యూటీలో ఆపద వస్తే వాచ్‌మెన్ మినహా ఎవ్వరూ అందుబాటులో లేరు. మహిళా వైద్యుల మాన, ప్రాణాలకు రక్షణ కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. అప్పుడు భయాందోళనలు వదిలి రోగులకు మెరుగైన సేవలు అందిస్తారు.

- డాక్టర్ కొలిపాక సంధ్య, కొల్లూరు పీహెచ్‌సీ

న్యూస్‌రీల్

పంచాయతీ వ్యవస్థకు మేలు



అద్దంకి రూరల్: కూటమి ప్రభుత్వంతో పంచాయతీరాజ్ వ్యవస్థకు పూర్వ వైభవం వస్తుందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. శుక్రవారం సంతమాగులూరు మండలం మక్కెనవారిపాలెం గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ.. రెండు నెలల్లోనే సీఎం చంద్రబాబు 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ. 990 కోట్లు, జల్‌జీవన్ మిషన్ కింద రాష్ట్ర వాటాగా రూ. 500 కోట్లు గ్రామ పంచాయతీల ఖాతాల్లో జమ చేశారన్నారు. ఐదేళ్ల పరిపాలనలో గత ప్రభుత్వం గ్రామాభివృద్ధికి ద్రోహం చేసిందని ఆరోపించారు. కూటమి పాలనలోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవోలు, అధికారులు పాల్గొన్నారు.

బూరుగులమ్మకు గాజుల సారె




రేపల్లె రూరల్: శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని గ్రామదేవత బూరుగులమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు నందివెలుగు భాను సుధాకర్ ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. గాజుల చీరను అమ్మవారికి అలంకరించారు. ఆలయాన్ని గాజులు, బియ్యపు చేటలతో సుందరంగా తీర్చిదిద్దారు. మహిళలు పసుపు, కుంకుమ, పండ్లు, గాజులతో కూడిన సారెతోపాటు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

ఎరువుల తూకాల్లో తేడాలొస్తే కఠిన చర్యలు



చీరాల టౌన్: ఎరువుల తూకాల్లో తేడాలొస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ కంట్రోలర్ ఐజాక్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన చీరాలలోని పలు దుకాణాలను పరిశీలించారు. నాలుగు చోట్ల 50 కేజీలు ఉండాల్సిన బస్తా బరువు 48.50 కేజీలు ఉండటంపై కేసులు నమోదు చేశారు. తర్వాత ఆయన మాట్లాడుతూ.. ఎరువులు విక్రయించినప్పుడు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కంట్రోలర్ లిల్లీ, ఇన్‌స్పెక్టర్లు నాగేశ్వరరావు, రామ్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

యార్డులో 46,598 బస్తాల మిర్చి విక్రయం



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 41,874 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 46,598 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల సగటు ధర రూ.7,500 నుంచి రూ. 17,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.7,500 నుంచి 18,700 వరకు లభించింది. ఏసీ కామన్ రకం రూ. 9,000 నుంచి రూ. 15,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 8,500 నుంచి రూ. 18,800 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.12,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 14,813 బస్తాల నిల్వ ఉన్నట్లు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

ఉచిత మాటలు.. అవినీతి మేటలు!

'ఇక ఉచిత ఇసుక సరఫరాపై కలెక్టర్లు రోజూ నివేదిక ఇవ్వాలి. అక్రమ తవ్వకాలు, రవాణాను కట్టడి చేసే బాధ్యత కలెక్టర్లదే'... ఇవీ బుధవారం సచివాలయంలోని తన చాంబర్‌లో సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి చంద్రబాబు మాటలు. బాపట్ల జిల్లాలోని రేపల్లె, వేమూరు, పర్చూరు నియోజకవర్గాలలో మాత్రం ఇసుక, మట్టి అక్రమాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. కూటమి నేతలు, ప్రధానంగా పచ్చ పార్టీ వారి కనుసన్నల్లోనే ఈ తతంగం సాగుతోంది. స్థానికంగానే కాకుండా ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు సైతం పంపుతున్నారు. రేపల్లె, వేమూరు నియోజకవర్గాల నుంచి ఇసుక, మట్టి తరలించి అమ్ముకుంటున్నారు. పర్చూరు నియోజకవర్గం నుంచి గ్రావెల్, ఇసుక, గ్రానైట్ కూడా నిత్యం తరలిపోతోంది. రోజుకు పన్నుల రూపంలో ప్రభుత్వానికి రూ.కోట్ల మేరకు రాబడికి గండి పడుతోంది.



కొల్లూరు మండలం పెసర్లంక నక్కపాయ గండి ప్రాంతంలో ఇసుక తవ్వి ట్రాక్టర్లలో నింపుతున్న దృశ్యం

- ఇసుక విధానంలో ప్రభుత్వం రెండు నాలుకల ధోరణి
- సమీక్షల్లో చెప్పేదొకటి.. క్షేత్రస్థాయిలో చేసేది మరొకటి
- అధికార పార్టీ నేతల కనుసన్నల్లోనే అక్రమ రవాణా
- సామాన్యుడిపై భారం పెంచి అడ్డగోలుగా దోపిడీపర్వం

సాక్షి ప్రతినిధి, బాపట్ల: జిల్లాలో పచ్చనేతల కనుసన్నల్లో జరుగుతున్న ఇసుక, మట్టి అక్రమాలకు అంతే లేకుండా పోతోంది. పర్చూరు నియోజకవర్గంలోని చినగంజాం మండలం కడవకుదురు నుంచి ప్రకాశం, పల్నాడు జిల్లాలతోపాటు తెలంగాణకు కూడా తరలిస్తున్నారు. వేమూరు, రేపల్లె నియోజకవర్గాల్లోని కృష్ణా నదితోపాటు తీర భూముల నుంచి స్థానికంగానే కాక గుంటూరు, తెనాలి ప్రాంతాలకు పంపుతున్నారు. పెసర్లంక ప్రాంతంలోని పొలాల్లో పెద్ద యంత్రాలు పెట్టి ఏకంగా 20 నుంచి 30 అడుగుల మేర ఇసుక తవ్వి తరలిస్తున్నారు.

పొంచి ఉన్న పెను ముప్పు

అక్రమ ఇసుక తవ్వకాలతో కృష్ణా తీరం (కరకట్ట) దెబ్బతింటోంది. ఇది ఏ క్షణమైనా కోతకు గురై పంట పొలాలకు ముప్పు తెచ్చే ప్రమాదమూ లేకపోలేదు. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. 2009లో భట్టిప్రోలు మండలం ఓలేరు-పల్లెపాలెం వద్ద కరకట్ట తెగి రేపల్లె పట్టణంలోకి నాలుగు అడుగుల మేర నీరు చేరింది. నాలుగు రోజులపాటు ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. పెద్ద ఎత్తున నష్టం కూడా వాటిల్లింది.

వందల వాహనాల్లో తరలింపు

గాజుల్లంక ప్రాంతంలో కృష్ణానది నుంచి ఇసుకను తవ్వి ట్రాక్టర్ల ద్వారా తరలించి.. తర్వాత టిప్పర్లతో గుంటూరు, తెనాలికి పంపుతున్నారు. చిలుమూరు, జువ్వలపాలెం, ఈపూరు, కొల్లూరు పొలిమేర డొంకలోని పెదలంక క్వారీ నుంచి అక్రమ రవాణా సాగుతోంది. ఎక్కువగా రాత్రిళ్లు ఈ తతంగం సాగుతోంది. స్థానికంగా రేపల్లె, నగరం, కొల్లూరు, వేమూరు, నిజాంపట్నం ప్రాంతాలకు రోజుకు వందల సంఖ్యలో టిప్పర్లు, ట్రాక్టర్లతో తరలిస్తున్నారు.

సామాన్యుడిపైనే భారం

పచ్చనేతల దోపిడీ పర్వంతో సామాన్యుడిపైనే పెను భారం పడుతోంది. ఇసుక కొనాలంటే భయపడే పరిస్థితి తెచ్చారు. ట్రాక్టర్ రూ.8 వేల నుంచి రూ.10 వేలకు, చిన్న టిప్పర్ (మూడు ట్రాక్టర్ల ఇసుక పట్టేది) అయితే గుంటూరు, తెనాలి ప్రాంతాలకు రూ.25 వేల నుంచి రూ.30 వేలకు విక్రయిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ట్రాక్టర్ ఇసుక రూ. 4 వేల లోపు ఉండేది. కూటమి నేతల దోపిడీ పుణ్యమాని ఇప్పుడు రూ. 10 వేలకు కొనాల్సి వస్తోందని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కృష్ణా నది ఇసుక కావడంతో డిమాండ్ ఉంటోంది. పచ్చనేతల వ్యవహారం చాలాచోట్ల అటు పోలీసులకు, ఇటు రెవెన్యూ అధికారులకు కూడా ఆదాయ వనరుగా మారింది. ఒకవేళ అరకొరగా పట్టుకున్నా నేతల ఒత్తిళ్లతో రాత్రికి రాత్రే వదిలేస్తున్నారు.



పంట భూముల్లో తవ్వకాలతో ఏర్పడిన భారీ గోతులు

నిఘాపై గొప్పలు.. పట్టుకుంటే తిప్పలు

చీరాల: అధికారుల పరిస్థితి ముందు నుయ్యి.. వెనుక గొయ్యిగా మారింది. జిల్లా కలెక్టర్, ఎస్పీ ఆదేశాలతో ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు ముమ్మర ప్రయత్నాలు చేపడుతున్నారు. తీరా కష్టపడి పట్టుకున్నాక వదిలేయాలని అధికార పార్టీ పెద్దల నుంచి ఆదేశాలు వస్తుండటంతో తల పట్టుకోవాల్సి వస్తోంది. ప్రభుత్వ జిల్లా సమీక్షలో చీరాల ప్రాంతంలో ఇసుక యార్డుగానీ, తవ్వకాలు, రవాణా వంటివి ఏమీ లేవని అధికారులు తేల్చేశారు. ఒక్క అద్దంకి, పర్చూరు నియోజకవర్గాల్లో మాత్రమే ఇసుక తవ్వకాలు, రవాణా, అమ్మకాలు ఉన్నాయి. దీంతో నూతనంగా వచ్చిన తహసీల్దార్ కె.గోపీకృష్ణ, తన రెవెన్యూ సిబ్బందితో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. అప్పటికే విషయం తెలుసుకున్న ట్రాక్టర్ యాజమానులు వాటిని నిలిపివేశారు. రోజూ మాదిరిగానే టైరు బండ్లతో పాతచీరాల గ్రామంలో ఒక అక్రమ క్వారీ నుంచి ఇసుక తరలింపు చేపట్టారు. శుక్రవారం తెల్లవారుజామున 3 గంటలకు రెవెన్యూ అధికారులు, సిబ్బంది నిఘా పెట్టి ఒక ట్రాక్టరు, 17 టైరు బండ్లను పట్టుకున్నారు. వాటిని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. సాధారణంగా ఎద్దుల నుంచి ఇళ్లకు పంపి టైరు బండ్లకు జరిమానాలు విధిస్తుంటారు. కానీ ప్రస్తుతం అధికార పార్టీ నేతల నుంచి ఫోన్లు రానే వచ్చాయి. దీంతో మొదటి తప్పుగా హెచ్చరికతో మానవీయ కోణంతో వదిలేశామని తహసీల్దార్ చెప్పాల్సి వచ్చింది. ఈ బండ్ల నుంచి అమ్మకానికి తీసుకెళ్తున్న ఇసుకను మాత్రం తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో డంప్ చేయించారు. ఇసుకను ఇకపై తరలించబోమని తూతూమంత్రంగా దొరికిన వారితో పత్రంపై సంతకాలు చేయించుకుని ఇళ్లకు పంపించారు. ట్రాక్టర్‌ను మాత్రం పోలీసులకు అప్పగిస్తామని రెవెన్యూ అధికారులు చెప్పారు. పాత చీరాలలో అక్రమ క్వారీల నుంచి ఇసుకను యథేచ్ఛగా తరలిస్తున్నారు. కానీ టైరు బండ్లు మాత్రమే పట్టుకుని అసలు యాజమానులను వదిలిపెడుతున్నారు. సమాచారం ఉన్నప్పటికీ యాజమాని ఎవరో తెలియదని అధికారులు చెప్పడంలో ఆంతర్యం వారికే తెలియాలి.



తహసీల్దార్ కార్యాలయం ముందు నిలిపిన ఇసుక టైరు బండ్లు

ఆర్టీసీ అభివృద్ధికి కృషి

రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్

రేపల్లె రూరల్: ఆర్టీసీ అభివృద్ధికి కృషి చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. రేపల్లె ఆర్టీసీ డిపోనకు నూతనంగా వచ్చిన ఇంద్ర డీలక్స్ బస్సులను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రయాణికులను సురక్షితంగా గమ్య స్థానాలకు ఆర్టీసీ చేరుస్తోందన్నారు. ఆ నమ్మకాన్ని పెంచేలా సంస్థ అభివృద్ధికి సిబ్బంది కృషి చేయాలని సూచించారు. గత ప్రభుత్వం ఆర్టీసీని నిర్వీర్యం చేసిందన్నారు. గాడిలో పెట్టటంతోపాటు లాభాల బాటపట్టేలా ముఖ్యమంత్రి చంద్రబాబు సంస్కరణలు దోహదపడతాయన్నారు. సూపర్ సిక్స్‌లో ఇచ్చిన హామీలలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అతి త్వరలో అమలయ్యేలా కృషి చేస్తామన్నారు. బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఆర్డీవో హెలా షారోన్, డిపో ఇన్‌చార్జి మేనేజర్ రాజశేఖర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం విగ్రహావిష్కరణ

పట్టణంలోని చిన్నమసీదు సెంటరులో ఏర్పాటు చేసిన మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహాన్ని బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్‌తో కలిసి మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆవిష్కరించారు. దేశ అభివృద్ధికి కలాం చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మైనార్టీ సంఘం ప్రతినిధులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



బస్సు సర్వీసులను ప్రారంభిస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

వైద్య సేవల మెరుగుకు చర్యలు

నగరం: గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి అనగాని సత్యప్రసాద్ చెప్పారు. మండలంలోని ధూళిపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రూ.6 కోట్లతో నిర్మించబోయే 30 పడకల భవన సముదాయానికి శుక్రవారం ఆయన భూమి పూజ చేశారు. అనంతరం గ్రామ సభలో మాట్లాడుతూ.. స్థానికులకు వైద్యసేవల చేరువకు ఈ అభివృద్ధి పనులు చేస్తున్నట్లు తెలిపారు. వసతుల కల్పనకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి మాట్లాడుతూ.. అధికారులు గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ విజయమ్మ, ఆర్డీవో షారోన్ తదితరులు పాల్గొన్నారు.

మల్లెపూల అలంకారంలో భ్రమరాంబ దర్శనం

పెదకాకాని: శ్రావణమాసం మూడో శుక్రవారాన్ని పురస్కరించుకుని పెదకాకాని శివాలయంలో భ్రమరాంబ అమ్మవారిని మల్లెపూలతో అలంకరించారు. శ్రీ మల్లేశ్వరస్వామికి అర్చకులు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, శ్రీ భ్రమరాంబ అమ్మవారికి లక్ష మల్లెపూలతో ప్రత్యేక పూజ, హోమాలు నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. తెనాలి పట్టణానికి చెందిన రెడ్డి నవీన్ కుమార్-విజయలక్ష్మి దంపతులు, నేలవెల్లి కోటేశ్వరి కుటుంబ సభ్యుల సహకారంతో అమ్మవారికి ప్రత్యేక పూల అలంకరణ చేసినట్లు ఆలయ ఉప కమిషనర్ డి. శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. నాలుగో శుక్రవారం గాజుల అలంకారంలో భక్తులకు అమ్మవారు దర్శనమిస్తారని పేర్కొన్నారు. అదేరోజు ఉచిత సామూహిక శ్రావణమాస వరలక్ష్మి వ్రతాలు ఉంటాయన్నారు. అమ్మ వారిని లక్ష గాజులతో అలంకరించనున్నట్లు తెలిపారు.



తాగునీటి చెరువులను నింపండి

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: తాగునీటి చెరువులను పశ్చిమ కృష్ణా డెల్టా నుంచి విడుదలైన నీటితో సకాలంలో పూర్తిగా నింపాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి ఆదేశించారు. జల వనరులు, మురుగునీటి కాలువల నిర్వహణపై జిల్లా కలెక్టర్ శుక్రవారం వీక్షణ సమావేశం నిర్వహించారు. భవిష్యత్తులో నీటి ఎద్దడి రాకుండా చూడాలన్నారు. కృష్ణా డెల్టా నుంచి నీటి విడుదలపై ఆరా తీశారు. 800 క్యూసెక్కులకు తగ్గకుండా విడుదల చేయాలన్నారు. 20 రోజుల్లో భవనాసి చెరువు నింపాలని పేర్కొన్నారు. దాని పరిధిలోని భూములన్నీ ఆక్రమణలకు గురికావడంపై ఆరా తీశారు. ఆక్రమణల తొలగింపుపై దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఇరిగేషన్ అధికారి ఉమామహేశ్వరరావు, ఈఈలు, డీఈలు, తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక విద్యపై అవగాహన పెంచాలి

పాఠశాలల్లో డ్రాప్ అవుట్స్‌ను నివారించడానికి విద్యార్థులను ఓపెన్ స్కూల్ సొసైటీలో చేర్పించాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశాలపై శుక్రవారం వీక్షణ సమావేశం నిర్వహించారు. బడి ఈడు పిల్లలందరూ పాఠశాలలోనే ఉండాలని కలెక్టర్ చెప్పారు. పొదుపు సంఘాల మహిళలు, అంగన్వాడీ కార్యకర్తలు ఇంటర్మీడియట్ విద్యార్హత పొందేలా ఓపెన్ స్కూల్లో చేరాలని సూచించారు. ప్రవేశాల గడువు ఈ నెల 28వ తేదీతో ముగుస్తుందన్నారు. దీనిపై విస్తృత ప్రచారం చేయాలని తెలిపారు. అదనపు ఎస్పీ విఠలేశ్వర రావు, డీఈవో నారాయణ, అనుబంధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

స్ఫూర్తి ప్రదాత టంగుటూరి

బ్రిటిష్ వారి తూటాలకు ఎదురొడ్డి నిలిచిన ధైర్యశాలి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు స్ఫూర్తితో అందరూ ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ప్రకాశం పంతులు జయంతి శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగింది. పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో ఆయన చిత్రపటానికి జె.వెంకట మురళి, జిల్లా సంయుక్త కలెక్టర్ బి.సుబ్బారావులు పుష్పమాలలతో ఘనంగా నివాళులర్పించారు. ఆయన ధైర్యం, స్ఫూర్తితో పరిపాలనలో ముందుకు సాగాలని చెప్పారు. జిల్లా రెవెన్యూ అధికారి సి.హెచ్. సత్తిబాబు, ఉప కలెక్టర్ లక్ష్మీకుమారి, వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎస్ విజయమ్మ, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

దారిమళ్లిన ఇన్‌పుట్ సబ్సిడీ

- అత్తోట గ్రామసభలో రైతుల ఆరోపణ
- తమకు న్యాయం చేయాలని మంత్రి మనోహర్‌కు వినతిపత్రం
- రూ.50 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు కుంభకోణం

తెనాలి: మిచాంగ్ తుపానుకు సంబంధించి, ఎన్నికల ముందు అప్పటి ప్రభుత్వం అందజేసిన ఇన్‌పుట్ సబ్సిడీ అసలు రైతులు, కౌలు రైతులకు దక్కకుండా ఇతరుల ఖాతాలకు దారి మళ్లిందని కొల్లిపర మండల గ్రామం అత్తోటకు చెందిన రైతులు ఆరోపించారు. దీనికి సంబంధిత అధికారులే కారణమని ధ్వజమెత్తారు. ఇన్‌పుట్ సబ్సిడీ దారి మళ్లడంపై అధికారుల్ని అత్తోట గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట శుక్రవారం జరిగిన గ్రామసభలో పలువురు రైతులు నిలదీశారు. అనంతరం రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ దగ్గరలోని వల్లభాపురంలో గ్రామసభలో ఉన్నట్టు తెలుసుకుని అక్కడకు వెళ్లారు. మంత్రిని కలిసి సమస్యను విన్నవించారు. ఇన్‌పుట్ సబ్సిడీ మొత్తం వేరే ఖాతాలలో జమ అవ్వడాన్ని, సంబంధిత వ్యక్తుల ఆధార్ కార్డు వివరాలను మంత్రికి అందజేశారు. దీనిపై విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, తమకు న్యాయం చేయాలని కోరారు. వీరిలో అత్యధికులు సాగు చేస్తున్న వ్యవసాయ భూమి తెనాలి రూరల్ మండల పరిధిలోని గ్రామాల్లోనే ఉంది. పలువురు నేలపాడు, కంచర్లపాలెం, కఠెవరం, తేలప్రోలు పరిసరాల్లోని పొలాల్ని సొంతంగా, కౌలుకు సాగు చేస్తున్నారు.



కౌలు కార్డులు చూపుతున్న రైతులు

బాధితుల ఆరోపణల్లో కొన్ని..

- కంచర్లపాలెం పరిధిలోని 7.5 ఎకరాలు కౌలుకు చేస్తున్న యర్రు శ్రీనివాసరావుకు 3.75 ఎకరాలకు మాత్రమే ఎకరాకు రూ.6,800 చొప్పున ఇన్‌పుట్ సబ్సిడీ బ్యాంకు ఖాతాలో జమయింది. మిగిలిన భూమికి రావాల్సిన మొత్తం వేరెవరికో జమ చేశారు.
- అత్తోటకే చెందిన రైతు యర్రు సత్యనారాయణ నేలపాడులో ఐదు ఎకరాలు సాగు చేస్తున్నారు. ఆయనకు రావాల్సిన ఇన్‌పుట్ సబ్సిడీ మొత్తం చినరావూరుకు చెందిన వేరొకరి బ్యాంకు ఖాతాలో జమ చేశారని ఆరోపించారు.
- దాదాపు వంద మందికిపైగా రైతుల సబ్సిడీ మొత్తం దారిమళ్లడం, మరికొందరికి అసలు జమ కాని విషయాన్ని ప్రస్తావించారు. మొత్తం రూ.50 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు దారి మళ్లిందని ఆరోపించారు. వెంటనే విచారించి తమకు రావాల్సిన డబ్బులు ఇప్పించాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు బాపట్ల విద్యార్థి



బాపట్ల టౌన్: బాపట్ల లిటిల్ ఏంజెల్స్ పాఠశాలకు చెందిన విద్యార్థి వై.సతీష్ 600 మీటర్ల పరుగుపందెంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. శుక్రవారం గుంటూరు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో అండర్-19 విభాగంలో అతడు ప్రథమస్థానంలో నిలిచాడు. దీంతో సెప్టెంబర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఉమ్మడి గుంటూరు జిల్లా తరఫున పాల్గొనే అవకాశం దక్కింది. శుక్రవారం సాయంత్రం స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో వై. సతీష్‌ను పాఠశాల డైరెక్టర్ అభినవ్, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

ఒకటిన సబ్ జూనియర్ ఖోఖో జట్ల ఎంపిక

నకరికల్లు: ఉమ్మడి గుంటూరు జిల్లా సబ్‌జూనియర్ ఖోఖో జట్ల ఎంపికలు నరసరావుపేట శంకరభారతీపురం ఉన్నత పాఠశాలలో సెప్టెంబర్ 1వ తేదీన నిర్వహించనున్నట్లు గుంటూరు జిల్లా ఖో-ఖో అసోసియేషన్ కార్యదర్శి చింతా పుల్లయ్య శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికైన జట్లు సెప్టెంబర్ నెలలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయని తెలిపారు. సెలక్షన్స్‌లో పాల్గొనదలచిన క్రీడాకారులు 2010 అక్టోబర్ 1వ తేదీలోపు పుట్టి ఉండాలన్నారు. వయస్సు, ఎత్తు, బరువు కలిపి మొత్తం 215 పాయింట్లకు మించి ఉంచకూడదని అన్నారు. సెలక్షన్స్‌లో పాల్గొనేందుకు ఒక్కో పాఠశాల నుంచి ముగ్గురు లేదా నలుగురు మాత్రమే పాల్గొనాలని అన్నారు. ఎంపికకు వచ్చే సమయంలో వయస్సు ధ్రువీకరణపత్రం వెంట తెచ్చుకోవాలని సూచించారు. వివరాలకు జి.ఝాన్సీ రాణి, ఫిజికల్ డైరెక్టర్, శంకరభారతీపురం, నరసరావుపేట, సెల్ 9949533234 నంబరులో సంప్రదించాలన్నారు.

రైలులో గుర్తు తెలియని వ్యక్తి మృతి

నరసరావుపేటటౌన్: ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైలులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రైల్వే ఎస్‌ఐ తన్నీరు సుబ్బారావు తెలిపిన వివరాలు... సుమారు 45 సంవత్సరాల వయస్సు ఉన్న వ్యక్తి రైలు బోగీలో మృతి చెంది ఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుడు నీలం రంగు నిండు చేతుల చొక్కా, బ్లూ కలర్ ఫ్యాంట్ ధరించి ఉన్నాడు. అనారోగ్యంతో మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు రైల్వే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్‌ఐ కోరారు.

ప్రభుత్వం రక్షణ చర్యలు చేపట్టాలి



కోల్‌కతా ఘటన హేయమైనది. ఎంతో అభివృద్ధి చెందిన నేటి పరిస్థితుల్లో ఈ తరహా ఘటనలు భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ప్రతి ఒక్కరూ వీటిని ఖండించాలి. వైద్యులు, సిబ్బంది రక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలి. వసతులు సమకూర్చాలి. ఆస్పత్రులలోనూ సీసీ కెమెరాలు, పోలీసు రక్షణ ఉండేలా చూడాలి. దాడులను అరికట్టడానికి ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్లు ఏర్పాటు చేయాలి. ఫిర్యాదు రాగానే స్పందించేలా ఉండాలి.

– డాక్టర్ చంద్రిక, చందోలు పీహెచ్‌సీ, పిట్టలవానిపాలెం మండలం



దాడులు చేసే వారికి కఠిన శిక్షలు అవసరం

వైద్యులు, సిబ్బందిపై దాడులు చేసే వారిని కఠినంగా శిక్షించాలి. కోల్‌కతా ఘటనలో ఇంతవరకూ బాధిత కుటుంబానికి న్యాయం జరగకపోవడం బాధాకరం. వైద్యులు పనిచేసే చోట పోలీసుల రక్షణ కల్పించాలి. అవసరమైతే కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా చట్టం తీసుకురావాలి. దాన్ని సమర్థంగా అమలు చేయాలి. అన్ని ప్రభుత్వ ఆస్పత్రులలో సీసీ కెమెరాలు పెట్టి, నిరంతరం పర్యవేక్షణ ఉంచాలి. రోగులకు సహాయకులుగా ఒక్కరినే అనుమతించాలి.

– డాక్టర్ కీర్తి సరోజ్, సంతరావూరు పీహెచ్‌సీ, చినగంజాం మండలం



వైద్యుల రక్షణకు కఠిన చట్టాలు తేవాలి

– సీఐటీయూ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మణిలాల్

రేపల్లె రూరల్: మహిళా వైద్యులు, సిబ్బంది రక్షణకు ప్రభుత్వాలు కఠిన చట్టాలు చేయాలని సీఐటీయూ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మణిలాల్ డిమాండ్ చేశారు. కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన అత్యాచారం, హత్య కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణంలోని బస్టాండ్ సెంటరులో శుక్రవారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. నిందితులను వెంటనే శిక్షించాలని కోరారు. అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కే ఝాన్సీ మాట్లాడుతూ జూనియర్ డాక్టర్‌పై జరిగిన దారుణం సిగ్గుచేటన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ అనుబంధ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్, ఆశా వర్కర్స్, ఐకేపీ సభ్యులు మేరీమణి, రత్నకుమారి, సీహెచ్ వీరలక్ష్మి, గ్లోరీ, శేషుకుమారి, కృష్ణకుమారి, బేబీరాణి, నాయకులు కె.రమేష్, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

చెరుకుపల్లి: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై దారుణానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని గుళ్లపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కవిత డిమాండ్ చేశారు. పాఠశాల ఆవరణలో శుక్రవారం ఉపాధ్యాయులు, విద్యార్థులు ఈ ఘటనపై కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేశారు.



గుళ్లపల్లి పాఠశాలలో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఎస్ఎఫ్ఐ, సీఐటీయూ, ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శృతి బీఎస్సీ నర్సింగ్ కళాశాల విద్యార్థులు, ఎన్‌ఆర్‌ఐ కళాశాలలో చదివే బాలికలు గుళ్లపల్లి నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు, ఐలాండ్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. రెండు నిమిషాలపాటు జూనియర్ వైద్యురాలికి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పి.మనోజ్, సీఐటీయూ జిల్లా నాయకుడు శరత్, అహ్మద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో...

బాపట్ల టౌన్: కోల్‌కతాలో అత్యాచారానికి పాల్పడిన హంతకులను కఠినంగా శిక్షించాలని బార్ అసోసియేషన్ అధ్యక్షులు విన్నకోట సత్యప్రసాద్ పేర్కొన్నారు. ఈ ఘటనపై శుక్రవారం కోర్టు భవనాల సముదాయ ప్రాంగణంలో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. విన్నకోట సత్యప్రసాద్ మాట్లాడుతూ.. జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం హేయమైన చర్య అన్నారు. కేసు దర్యాప్తులో నిర్లక్ష్యంపై ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసు అధికారులు, బాధ్యులైన ఆసుపత్రి సిబ్బంది తదితరులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితురాలి కుటుంబానికి సత్వర న్యాయం జరగాలన్నారు. వైద్య సిబ్బందికి రక్షణ కల్పించేలా చట్టాలు రూపొందించాలని పేర్కొన్నారు. ధర్నాలో న్యాయవాదులు జెడ్.బాషా, ఆర్. వెంకటేశ్వర్లు, డి. శ్రీరామ్ మూర్తి, ప్రేమ్‌చంద్, అవినాష్, వై.నరేష్, భీమా లీలాకృష్ణ, డి.ఫిలిప్స్, చలపతిరావు, గ్రంధి సాంబశివరావు, కె.రవిబాబు, జాకబ్, సతీష్ రాజా, కొర్నేలియా, కత్తి నాగలక్ష్మి, నాగమోహిని, లింగంశెట్టి దివ్య, మాధురి, శరత్, హరిప్రసాద్, బండి రామ్మూర్తి, ప్రవీణ్, అంబటి మురళి, స్టాలిన్, డి.కిషోర్, లేళ్ల శ్రీను పాల్గొన్నారు.



రేపల్లెలో నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్, ఆశా కార్యకర్తలు తదితరులు



చెరుకుపల్లిలో నిరసన ర్యాలీలో విద్యార్థులు, ప్రజా సంఘాల ప్రతినిధులు



కోర్టు భవనాల సముదాయ ప్రాంగణంలో బార్ అసోసియేషన్ సభ్యుల నిరసన దృశ్యం

యువతకు ఆదర్శం ప్రకాశం పంతులు జీవితం

జిల్లా ఎస్పీ తుషార్ డూడీ



పూలమాలతో నివాళి అర్పిస్తున్న తుషార్ డూడీ

బాపట్ల టౌన్: ప్రకాశం పంతులు జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడీ సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత ప్రకాశం పంతులు చిత్రపటానికి ఆయన పూలమాలలేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. ప్రకాశం పంతులు ప్రస్తుత ప్రకాశం జిల్లాలోని వినోదరాయునిపాలెం గ్రామంలో నిరుపేద కుటుంబంలో జన్మించి కష్టపడి చదువుకున్నారని చెప్పారు. ఆంధ్ర రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి అయ్యారన్నారు. దేశభక్తితో స్వాతంత్ర్య ఉద్యమంలో క్రియాశీలకంగా వ్యవహరించారని గుర్తుచేశారు. ఆయన స్ఫూర్తితో యువత ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్, ఏవో శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ చంద్రమోహన్, వెల్ఫేర్ ఆర్ఐ శ్రీనివాసరెడ్డి, అడ్మిన్ ఆర్ఐ మౌలుద్దీన్, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లను అడ్డుకునేలా దారికి గండి

కొల్లూరు: ఇసుక అక్రమ రవాణాదారుల ఆగడాలు అధికమవడంతో ప్రభుత్వ యంత్రాంగం వారిని అడ్డుకోవడానికి చర్యలు చేపట్టింది. మండలంలోని పెసర్లంక అరవింద వారధి ఎగువ ప్రాంతంలోని పంట పొలాల వద్ద ట్రాక్టర్ల ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. బుధవారం అర్ధరాత్రి నిఘా బృందాలు ప్రయత్నించినప్పటికీ ట్రాక్టర్లు సహా అక్రమార్కులు పరారయ్యారు. బృందాల కదలికలపై వారే నిఘా పెట్టి ఏ కాస్త సమయం దొరికినా ట్రాక్టర్లలో ఇసుక భారీగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. గురువారం రాత్రి కూడా పెసర్లంక అరవింద వారధి ఎగువ ప్రాంతంలో తవ్వకాలు చేపట్టి ఇలా తరలించారు. సిబ్బంది వెళ్లేసరికి అప్రమత్తమయ్యారు. ట్రాక్టర్‌లో ఉన్న ఇసుక అన్‌లోడ్ చేయించి వెనక్కు పంపారు. అధికారులు వచ్చేశాక మరికొన్ని ట్రాక్టర్లు నదిలో ఇసుక తరలించేందుకు బయలుదేరాయి. అప్రమత్తమైన అధికారులు నదిలోకి అవి దిగకుండా దారికి పొక్లయిన్‌తో గండి కొట్టించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం పెసర్లంక వద్ద వేమూరు సెబ్ ఎస్‌ఐ గంగాధర్, డిప్యూటీ తహసీల్దార్ నిరంజన్, మైనింగ్ శాఖాధికారులు పరిస్థితిని పరిశీలించారు.



పెసర్లంక అరవింద వారధి ఎగువ ప్రాంతంలో ట్రాక్టర్లు దిగకుండా గండి

సీఎంఏ ఇంటర్ ఫలితాల్లో 'శ్రీమేధ' విజయకేతనం

గుంటూరు ఎడ్యుకేషన్: ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) శుక్రవారం ప్రకటించిన సీఎంఏ ఫైనల్ ఫలితాల్లో శ్రీమేధ విద్యాసంస్థల విద్యార్థులు అఖిల భారతస్థాయిలో టాప్ ర్యాంకులతో పాటు అత్యధిక ఉత్తీర్ణతా శాతాన్ని సాధించినట్లు సంస్థ చైర్మన్ అన్నా నందకిశోర్ తెలిపారు. గుంటూరు కొత్తపేటలోని క్యాంపస్‌లో జరిగిన విద్యార్థుల అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సీఎంఏ ఇంటర్ విభాగంలో షేక్ ఇర్ఫాన్ 800 మార్కులకు గాను 557 మార్కులతో అఖిల భారతస్థాయిలో 19వ ర్యాంకు, అన్నా ధీరజ్ 543 మార్కులతో 27వ ర్యాంకు, డి.లక్ష్మీ నరసింహ 460 మార్కులు, ఎస్.స్తుతి హర్షిత 448 మార్కులు, టి. రూపశ్రీ 439, టి. వరలక్ష్మి 436 మార్కులు సాధించారని తెలిపారు. ఇంటర్మీడియెట్ నుంచి సీఏ, సీఎంఏ కోర్సులకు అనుభవజ్ఞులైన అధ్యాపకులతో క్రమశిక్షణతో కూడిన శిక్షణ అందించడం ద్వారా తమ విద్యార్థులు అఖిల భారతస్థాయిలో టాప్ ర్యాంకులు కైవసం చేసుకున్నారని వివరించారు. గత 19 ఏళ్లుగా సీఏ, సీఎంఏ కోర్సుల్లో 450కు ఆల్ ఇండియా ర్యాంకులను సాధించినట్లు చెప్పారు. సీఎంఏ ఇంటర్ పూర్తయిన విద్యార్థులకు ఐసీఏఐ నెలకు రూ.25వేలు ఇంటర్న్‌షిప్ ఫీజుతో మంచి అవకాశాలు కల్పిస్తోందన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకుని, కామర్స్ ప్రొఫెషనల్‌గా ఎదగాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులను శ్రీమేధ చైర్మన్ అన్నా నందకిశోర్, డైరెక్టర్ శ్రీలక్ష్మి, సిబ్బంది అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న నందకిశోర్

ఖాదీ పరిశ్రమ పునరుజ్జీవానికి కృషి

- చేనేత, జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సునీత
- ఐలవరంలో ఘనంగా టంగుటూరి జయంత్యుత్సవాలు



మాట్లాడుతున్న సునీత. పక్కన కమిషనర్ రేఖారాణి, సీఈవో నాయక్ తదితరులు

ఐలవరం(భట్టిప్రోలు): అంతరించిపోతున్న ఖాదీ పరిశ్రమకు పునరుజ్జీవం కల్పించడంపై రాష్ట్రప్రభుత్వం దృష్టి సారించిందని చేనేత, జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కె.సునీత తెలిపారు. బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం ఐలవరం ఖాదీ సొసైటీ ప్రాంగణంలో శుక్రవారం చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో సమరయోధుడు టంగుటూరి ప్రకాశం పంతులు జయంత్యుత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ఆ శాఖ కమిషనర్ జి.రేఖారాణి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా సునీత మాట్లాడారు. రాష్ట్రంలో ఖాదీ సొసైటీల స్థాపనకు ప్రకాశం పంతులు విశేష కృషి చేశారని చెప్పారు. తొలుత ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్మికులు చేనేత మగ్గాలపై నేసిన చీరలకు ప్రత్యేకంగా స్టాల్స్‌లో అవకాశం లేకపోతే జిల్లా కేంద్రాల్లోని కార్యాలయాల్లో చోటు కేటాయిస్తామని చెప్పారు. కొనుగోలుదారులను తీసుకొచ్చేలా తమ వంతు ప్రయత్నం చేస్తామని తెలిపారు. ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డ్ (మంగళగిరి) సీఈవో నాయక్, జాయింట్ డైరెక్టర్ కె.కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగానికి రాజీనామా చేయాలంటూ వేధింపులు

బెల్లంకొండ: అధికార మదంతో టీడీపీ నాయకులు చిరు ఉద్యోగులను వేధింపులకు గురిచేస్తున్నారు. ఉద్యోగానికి చేయాలంటూ ఓ అంగన్‌వాడీ కార్యకర్తను ఒత్తిడి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మండలంలోని మన్నెసుల్తాన్‌పాలెం ఎస్సీ అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త మాటూరి బుజ్జి శుక్రవారం పత్రికా ప్రకటన విడుదల చేసింది. తాను 15 ఏళ్లుగా పనిచేస్తున్నానని, 2016లో ఉత్తమ కార్యకర్తగా జిల్లా కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రం అందుకున్నట్లు తెలిపింది. నా భర్త వైఎస్సార్ సీపీలో పనిచేస్తున్నాడనే కారణంతో కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి టీడీపీ నాయకులు వేధింపులకు గురి చేస్తున్నారని తెలిపింది. కేవలం తనను తొలగించి, వారికి అనుకూలంగా ఉండే వారిని ఉద్యోగంలో నియమించుకోవాలని భావించి తాను సరిగా పనిచేయడం లేదంటూ ఈనెల 19న తనపై గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారని తెలిపింది. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విచారణకు రాగా తాము చెప్పింది రాసుకోమని, మంచిగా తనను రాజీనామా చేస్తే చేయమనండి, లేకుంటే ప్రతిసారి మేము ఇలాగే ఫిర్యాదు చేస్తామని టీడీపీ నాయకులు అంటున్నారంటూ ఆవేదన వ్యక్తం చేసింది. తమపై రాజకీయ వేధింపులు ఆపాలని కోరింది.

విజ్ఞాన్ వర్సిటీకి 'అబెట్' అక్రిడిటేషన్

చేబ్రోలు: వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీకి ప్రతిష్ఠాత్మక యూఎస్ఏ బేస్డ్ అబెట్ (అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ)అక్రిడిటేషన్ లభించిందని వైస్ చాన్స్‌లర్ కల్నల్ పి.నాగభూషణ్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా వైస్ చాన్స్‌లర్ మాట్లాడుతూ దేశంలో కేవలం 12 యూనివర్సిటీలకు మాత్రమే అబెట్ అక్రిడిటేషన్ ఉందని, అందులో విజ్ఞాన్ యూనివర్సిటీ కూడా ఒకటని పేర్కొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలలో అబెట్ అక్రిడిటేషన్‌ను సాధించిన మొట్ట మొదటి యూనివర్సిటీగా విజ్ఞాన్ నిలిచిందని చెప్పారు. యూనివర్సిటీలోని ఐదు బ్రాంచ్‌లకు (సీఎస్ఈ, ఈఈఈ, ఈసీఈ, మెకానికల్, బయోటెక్నాలజీ) అబెట్ అక్రిడిటేషన్ ఆరు సంవత్సరాల పాటు లభించిందని వెల్లడించారు. అమెరికా నుంచి వచ్చిన 10 మంది సభ్యుల బృందం యూనివర్సిటీలో మూడు రోజుల పాటు తనిఖీ నిర్వహించి అక్రిడిటేషన్‌ను అందించిందని వివరించారు. అబెట్ అక్రిడిటేషన్ వల్ల విదేశాలలో ఉన్నత విద్యతో పాటు ఉపాధి అవకాశాలు బాగా మెరుగవుతాయని ఆయన తెలియజేశారు.

పటిష్ట రక్షణతో పరిశ్రమలను నిర్వహించాలి

అధికారుల సమావేశంలో గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: జిల్లాలో ప్రమాదకర కేటగిరిల్లోని పరిశ్రమల్లో ప్రమాదాల్ని నివారించేందుకు యాజమాన్యాలు పటిష్ట రక్షణ ఏర్పాట్లు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, తెలిపారు. కలెక్టరేట్‌లోని వీడియో సమావేశంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలోని పరిశ్రమల్లో సంబంధిత శాఖలు తనిఖీలు నిర్వహించి నివేదిక అందించాలని ఆదేశించారు. ముఖ్యంగా ప్రమాద నివారణ ఏర్పాట్లలో రాజీ ఉండదని స్పష్టం చేశారు. నూతనంగా ఏర్పాటు చేస్తున్న పరిశ్రమలకు సింగిల్ డెస్క్ విధానంలో సత్వరమే విద్యుత్ కనెక్షన్లు అందించాలని చెప్పారు. పరిశ్రమల స్థాపనకు వచ్చే దరఖాస్తుల్ని పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు రవాణా వాహనాలకే కాకుండా, వస్తు ఉత్పత్తి యూనిట్లకు రుణాలిచ్చేలా బ్యాంకులు చర్యలు తీసుకోవాలన్నారు. వారిని ప్రోత్సహించేందుకు ప్రత్యేకంగా డీపీఆర్ ప్రజంటేషన్ కార్యక్రమం నిర్వహించాలని తెలిపారు. జిల్లాలో 24 ఎంఎస్ఎంఈలకు పెట్టుబడి సబ్సిడీ, వడ్డీ రీఎంబర్స్‌మెంట్ సబ్సిడీ, పవర్ బిల్ సబ్సిడీకి సంబంధించి రూ.1.77 కోట్లు మంజూరు చేస్తూ కమిటీ తీర్మానించింది. సమావేశంలో పరిశ్రమల శాఖ జీఎం ఆర్. వెంకట్రావు, సోషల్ వెల్ఫేర్ డీడీ మధుసూదనరావు, లీడ్ బ్యాంక్ మేనేజర్ మహీపాల్‌రెడ్డి, చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శివకుమార్ రెడ్డి, పరిశ్రమల యజమానులు పాల్గొన్నారు.

ఘరానా చైన్ స్నాచర్ అరెస్ట్

విజయవాడస్పోర్ట్స్:విజయవాడ, నరసరావుపేటలో వరుస చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న నిందితుడు యన్నం సాయితేజరెడ్డిని అరెస్ట్ చేసినట్లు క్రైం ఏసీపీ స్రవంతిరాయ్ తెలిపారు. నిందితుడు నుంచి రూ.6.10 లక్షల విలువైన 87 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వన్ టౌన్‌లోని సీసీఎస్ స్టేషన్ వద్ద ఈ కేసుకు సంబంధించిన వివరాలను మీడియాకు ఆమె శుక్రవారం వెల్లడించారు. పల్నాడు జిల్లా నరసరావుపేట సమీపంలోని లింగంగుంట్ల గ్రామానికి చెందిన సాయితేజ రెడ్డి డిగ్రీ పూర్తి చేశాడని, మద్యం, ఆన్‌లైన్ బెట్టింగులకు అలవాటు పడి సులువుగా డబ్బు సంపాదించేందుకు చైన్‌స్నాచింగ్ మార్గాన్ని ఎంచుకున్నాడని చెప్పారు. మహిళల మెడలో బంగారు గొలుసులను తెంపేందుకు యమహా ఎఫ్‌జెడ్ వాహనాన్ని కొనుగోలు చేశాడని పేర్కొన్నారు. వాహనంపై హెల్మెట్ ధరించి రోడ్డుపై వెళ్లే మహిళల మెడలోని బంగారు గొలుసులను తెంచుకుని పరారయ్యేవాడని తెలిపారు. ఇటీవలే ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మాచవరం, పటమట పోలీస్ స్టేషన్‌ల పరిధిలో మూడు చైన్ స్నాచింగ్‌లకు పాల్పడ్డాడని, నరసరావుపేటలో ఒక చైన్ స్నాచింగ్ చేశాడని, విజయవాడలోని పలు ప్రాంతాల్లో నాలుగు చైన్ స్నాచింగ్‌లకు విఫలయత్నం చేశాడని వెల్లడించారు. దొంగిలించిన చైన్‌లను విక్రయించేందుకు విజయవాడ వచ్చిన సాయితేజరెడ్డిని రామలింగేశ్వరనగర్ వద్ద సీసీఎస్ సెంట్రల్ డివిజన్ సీఐ ఎస్.వి.వి.లక్ష్మీనారాయణ తన బృందంతో కలిసి అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ స్రవంతిరాయ్

రైలు కింద పడి వ్యక్తి మృతి

పిడుగురాళ్ల: గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. నడికుడి రైల్వే ఎస్‌ఐ శ్రీనివాసరావునాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. పిడుగురాళ్ల న్యూ రైల్వేస్టేషన్, పిడుగురాళ్ల రైల్వేస్టేషన్‌కు మధ్యలో కిలో మీటర్ రాయి 66/7-5 వద్ద గుర్తు తెలియని వ్యక్తి రైలు ఢీకొని మృతి చెంది ఉన్నాడని తెలిపారు. ఆ వ్యక్తి తెలుపు రంగు బారు చేతుల చొక్కా, తెలుపు రంగు లుంగీ ధరించి ఉన్నాడని అన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించామని తెలిపారు. వివరాలు తెలిసి ఉంటే 9440438256 నంబరుకు తెలియజేయాలని కోరారు.